సాక్షి
కర్నూలు

ఆదివారం । 29 । జనవరి । 2023



పెచ్చెర్వు వద్ద దర్శన కంకణాలు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లమల మీదుగా పాదయాత్రగా వచ్చే భక్తులకు పెచ్చెర్వు వద్ద దర్శన కంకణాలను అందించనున్నట్లు ఈఓ లవన్న తెలిపారు.



నమో నారసింహో

రుద్రవరం: పార్వేటగా ముత్తలూరు చేరుకున్న ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,617.33
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:54.164
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,422

న్యూస్‌రీల్

క్వింటా వేరుశనగ రూ.8,820

● కర్నూలు మార్కెట్‌లో రికార్డు ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధర పరుగులు పెడుతోంది. ప్రస్తుతం మార్కెట్‌కు రబీలో సాగు చేసిన వేరుశనగ వస్తోంది. సాధారణ సాగు 14,148 హెక్టార్లు ఉండగా.. 14,839 హెక్టార్లలో సాగయింది. రబీ వేరుశనగలో విత్తనం నాణ్యతతో పాటు నూనె శాతం కూడా అధికంగా ఉంటుంది. అందువల్లనే మార్కెట్‌లో వేరుశనగకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఈ నెల 24న రూ.8539, 25న రూ.8490, 27న రూ.8730 ప్రకారం ధర లభించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. శనివారం మార్కెట్‌కు 30 మంది రైతులు 286 క్వింటాళ్ల వేరుశనగ తీసుకురాగా.. కనిష్ట ధర రూ.8820, గరిష్ట ధర రూ.8820, మోడల్ ధర రూ.6598 లభించింది. రానున్న రోజుల్లో ధర ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.21 కోట్లు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి రికార్డు స్థాయిలో రూ.3,21,68,636 హుండీ ఆదాయం వచ్చింది. కరెన్సీ నోట్ల రూపేణా 3,14,98,676, నాణేలు మొత్తం రూ.6,69,960, బంగారం 109 గ్రాములు, వెండి కేజీ 168 గ్రాములు వచ్చినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. 30 రోజుల్లో ఇంత పెద్ద మొత్తం ఆదాయం రావడం విశేషమని పేర్కొన్నారు.

'నవోదయ' దరఖాస్తుకు 31 వరకు గడువు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సాగరిక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీ ఉంటుందని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేపు 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

జిల్లా పోలీసులకు ఎస్పీ అభినందన

కర్నూలు: గుడ్ పోలీసింగ్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రస్థానంలో నిలవడం సంతోషకరమని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయడంతో ఈ అరుదైన గౌరవం దక్కిందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫలితాలను సాధించడంలో పోలీసు యంత్రాంగానికి సహకరించిన జిల్లా ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు.

సెబ్ కర్నూలు ఏసీ బదిలీ



బదిలీ అయిన శ్రీనివాసాచారి


కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసాచారి బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా శ్రీనివాసాచారిని నెల్లూరుకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన శ్రీనివాసాచారి 1996లో సీఐ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరారు. 2021 జూలై 1 నుంచి ఈయన కర్నూలు సెబ్ ఏసీగా పనిచేస్తున్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కర్నూలులో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టును నంద్యాలకు మార్పు చేసి చిత్తూరులో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మదన్‌మోహన్ రావును నియమించారు.

ప్రపంచం చిన్నదై.. మేధస్సు పదునై!

SUNDAY SPECIAL

కర్నూలుకు చెందిన మాధవీలత, నీలారెడ్డి దంపతుల కుమారుడు చంద్రహాస్ పదో తరగతి చదువుతున్నాడు. ఎన్‌సీసీ, యోగా, స్విమ్మింగ్, కంప్యూటర్ ఒలంపియాడ్, నేషనల్ ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలంపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. ఎన్‌సీసీలో సిమిలేటరీ ఫైరింగ్ కమాండర్‌గా బెస్ట్ కేడెట్ అవార్డు తీసుకోవడం విశేషం.





కర్నూలులోని మాంటిస్సోరి పాఠశాలలో హితాస్వన 7వ తరగతి, లశిత్ 4వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ అక్కాతమ్ముళ్లు. కూచిపూడి, మ్యూజిక్, డ్రాయింగ్, శ్యాండ్‌ఆర్ట్, శ్లోక పఠనంతో పాటు కనీసం పది అంశాల్లో రాణిస్తున్నారు. లెక్కలేనన్ని అవార్డులు, రికార్డులు వీరి సొంతం. చిన్న వయస్సులోనే వీరి అద్భుతమైన ప్రతిభ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.



..వీరిద్దరే కాదు చాలామంది చిన్నారులు విద్యతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ తరం పిల్లల ఆలోచనా ధోరణి, తెలివితేటలు, జీవన విధానం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. ముఖ్యంగా ఆధునిక ప్రపంచాన్ని అందిపుచ్చుకోవడంలో తల్లిదండ్రులు కూడా వీరి తర్వాతే. మొబైల్‌లో యాప్స్, టీవీలో ఓటీటీ యాప్స్ డౌన్‌లోడ్, కంప్యూటర్ వెబ్‌సైట్‌లు.. ఇలా ఎందులోనైనా సమాచారం తెలుసుకోవాలంటే తల్లిదండ్రులు పిల్లలనే సంప్రదిస్తున్నారంటే ఏ స్థాయిలో వీరు తమను తాము తీర్చిదిద్దుకుంటున్నారో అర్థమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

పిల్లలు కాదు పిడుగులు

- ఆకట్టుకుంటున్న వయస్సుకు మించిన ప్రతిభ
- అరచేతిలో ఇమిడిపోయిన ప్రపంచం
- కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి
- చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ ప్రావీణ్యం
- పిల్లల అభిరుచులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం
- 'స్మార్ట్'గా మారిపోతున్న ఇళ్లు

20 ఏళ్ల కిందటితో పోలిస్తే ఇప్పటి పిల్లల్లో చురుకుదనం అధికం. కంప్యూటర్, స్మార్ట్ టీవీలు, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగం అప్పట్లో చాలా తక్కువ. తల్లిదదండ్రుల ఆర్థిక స్థోమత కూడా అంతంతే. ఈ కారణంగా నాటి పిల్లలు నాన్ ఎలక్ట్రానిక్ గేమ్స్‌కే పరిమితం. పల్లె, వార్డు, చుట్టపక్కల ఇళ్లతోనే అనుబంధం ముడిపడి ఉండేది. స్కూలు, ఊరు మినహా ఇతర ప్రపంచం తెలియని పరిస్థితి. ఇప్పటి పరిణామాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇంటర్నెట్ ప్రపంచంలో 'స్మార్ట్' వస్తువుల వినియోగం పెరిగింది. దాదాపు అన్ని ఇళ్లలో స్మార్ట్ టీవీలు కనిపిస్తున్నాయి. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులు అనివార్యం కావడంతో ప్రతీ చిన్నారికి తల్లిదండ్రులు ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు కొనిపెట్టారు. ఇంకొందరు తల్లిదండ్రులు వారి స్మార్ట్‌ఫోన్లను పిల్లలకు ఇచ్చి క్లాస్‌లు వినేలా చేశారు. దీంతో విద్యార్థులందరికీ వీటి వినియోగంపై పట్టు వచ్చింది. యూట్యూబ్‌లో స్పోర్ట్స్, ఇతర అంశాల వీడియోలు, షార్ట్స్ చూడటం పెరిగింది. మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ చివరకు అమ్మాయిలు కోన్ పెట్టుకోవాలన్నా యూట్యూబ్‌లో వీడియోలు చూసే స్థితికి వచ్చారు. దీంతో ప్రపంచం మొత్తం అరచేతిలోని 'స్మార్ట్‌ఫోన్', ఇంట్లోని 'స్మార్ట్ టీవీ' లోకి వచ్చింది. ఏ దేశం పేరు యూట్యూబ్‌లో టైప్ చేసినా అక్కడి ఫుడ్, కల్చర్, సిటీలైఫ్ అన్నీ క్షణాల్లో చూస్తున్నారు. దీంతో పిల్లలు తల్లిదండ్రులతో 'మమ్మీ ఆ కంట్రీ చాలా బాగుంటుంది.. అక్కడ ఇది చూడొచ్చు.. ఆ కంట్రీలో ఫుడ్ ఇలా ఉంటుంది!' అని చెబుతున్నారు. అంటే ఇంటర్నెట్ వల్ల ప్రపంచం నలుమూలల విషయాలను ఇంట్లో కూర్చుని చిన్నారులు తెలుసుకుంటున్నారు.

తల్లిదండ్రులదీ అదే దారి

ఏడాది పాపకు ఇడ్లీ తినిపించాలని వారి అమ్మ ఫోన్ లేదా టీవీ చూపించి తినిపిస్తోంది. పిల్లలు స్కూలు నుంచి రాగానే టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఓటీటీలు వచ్చాక పాత జనరేషన్‌తో పోల్చితే ఇప్పటి పిల్లలు సినిమాలు కూడా ఎక్కువగా చూస్తున్నారు. అప్పట్లో సినిమా చూడాలంటే థియేటర్‌కు వెళ్లాలి. లేదా ఊళ్లో ఒకరిద్దరికి టీవీలు ఉంటే ఆదివారం వరకూ వేచి చూడాలి. కానీ ఇప్పుడు ఓటీటీల్లో రోజూ సినిమాలు చూసే పరిస్థితి. టెక్నాలజీ ప్రస్తుత జనరేషన్ పిల్లల జీవితంలో విడదీయలేనంతగా భాగమైపోయింది. దీనికి తోడు స్కూళ్లలో కూడా స్క్రీన్, ప్రొజెక్టర్ ద్వారా బోధన చేస్తున్నారు. ఇది కూడా పిల్లల తీరుపై ప్రభావం పై చూపిస్తున్నాయి. గతంలో పిల్లలు తెలుగు మీడియం చదివేవారు. ఇప్పుడు అధికశాతం ఇంగ్లిష్ మీడియం చదువులే. పైగా గతంతో పోలిస్తే పాఠశాల స్థాయి నుంచి హైస్టాండర్డ్స్ ఉన్న సిలబస్‌ను బోధిస్తున్నారు. దీంతో కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెరిగాయి. పెద్దల కంటే పిల్లల్లోనే నాలెడ్జ్ ఎక్కువగా ఉంటోంది. ఇదంతా పిల్లల ఎదుగుదలకు మంచిదే. అయితే వీటితో పాటు ఈ 'లైఫ్‌స్టైల్' ప్రమాదాలను కూడా తెచ్చిపెడుతోంది.



చిరాకు.. కోపం నేటి తరంలో ఎక్కువ



ఇప్పటి జనరేషన్ ఎలక్ట్రానిక్ గేమ్స్ ఎక్కువగా ఆడుతున్నారు. మొబైల్, ల్యాప్‌టాప్, టీవీలకు అతుక్కుపోయి అదే ప్రపంచంగా ఎదుగుతున్నారు. నాలెడ్జ్ పక్కన పెడితే వీరి శారీరక దృఢత్వం తగ్గిపోతోంది. ఇది ఆరోగ్యంతో పాటు జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నేటి తరం పిల్లల్లో కోపం, చిరాకు తీవ్రంగా ఉంటున్నాయి. ప్రతీ చిన్న విషయానికి తల్లిదండ్రులపై, స్నేహితులపై ఆవేశపడుతున్నారు.

- పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల తీరే దీనికి కారణమవుతోంది.
- దీనివల్ల ఇతరులతో సులభంగా గొడవలకు దిగడం, చిన్న వయస్సులోనే ఆత్మహత్యలు చేసుకోవడం, ఇంట్లో బ్రదర్స్, సిస్టర్స్ ఉంటే నెలకు రెండు, మూడు సార్లు నాలుగైదు రోజుల పాటు మాట్లాడకుండా దూరంగా ఉండటం జరుగుతోంది.
- ఇవన్నీ కూడా జీవన విధానంలోని మార్పుతోనే జరుగుతున్నాయి.
- కుటుంబ సభ్యులతో కూర్చుని హాయిగా మాట్లాడకపోవడం.
- ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిన తర్వాత ఒక ఇంటికి, మరొక ఇంటికి సంబంధం లేకపోవడం.
- ఫోన్, టీవీలే స్నేహితులుగా పిల్లలు పెరగడం లాంటి కారణాలతోనే ఇలాంటివి జరుగుతున్నాయి.
- అలాగే చిన్న వయస్సులోనే దృష్టిలోపం, అనారోగ్య సమస్యలు పెరగడం పిల్లల భవిష్యత్‌కు మంచిది కాదని డాక్టర్లు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పరిమితంగా వాడితేనే ప్రయోజనం



పిల్లలు స్మార్ట్‌ఫోన్లను పరిమితంగా వాడితే చాలా ఉపయోగాలున్నాయి. చదవడం, వినడంతో పాటు తాజా పరిణామాలపై నాలెడ్జ్ పెరుగుతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో డిజిటల్ ప్లాట్‌ఫాంపై ఫోన్, వీడియో కాల్స్ మాట్లాడుతున్నారు. సాతియా, కామ్, ఆన్‌లైన్ యోగా వంటి ప్లాట్‌ఫాంలు పిల్లల్లో ఆరోగ్యకర వాతావరణాన్ని పెంచుతున్నాయి. పిల్లలు టెక్నాలజీని వారి ఎదుగుదలకు ఉపయోగించుకోవాలి. అనవసరంగా ఉపయోగిస్తే అనర్థాలు తప్పవు. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

– డాక్టర్ మురళి, చిన్నపిల్లల వైద్యనిపుణులు

పరిశ్రమలకు సింగిల్ డెస్కులో అనుమతులు

● డీఐపీసీ సమావేశంలో కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): పరిశ్రమల ఏర్పాటులో జాప్యం లేకుండా సింగిల్ డెస్కులో అనుమతులు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించేందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానాలు పలకాలని కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ(డీఐపీసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ పరిశ్రమల అనుమతుల కోసం 29 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 20 దరఖాస్తులకు ఆమోదం లభించిందన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా ఆమోదించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాకు సంబంధించి ఎక్స్‌పోర్టు యాక్షన్ ప్లాన్‌లో పత్తి, మిరప, కొర్రలతోపాటు ఉల్లి, టమాటాలను కూడా చేర్చినట్లు చెప్పారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని, అందులో భాగంగా ఎమ్మిగనూరులో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ రమణారెడ్డిని ఆదేశించారు. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాల కింద 45 క్లెయిమ్‌లకు సంబంధించి రూ. 2.96 కోట్ల సబ్సిడీ మంజూరు సిఫారసు చేస్తున్నట్లు చెప్పారు. బ్రాహ్మణపల్లి, గుట్టపాడులలో రెండు పరిశ్రమలకు ప్లాట్ల కేటాయింపు జరిగిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జెడ్ఎం విశ్వేశ్వరరావును ఆదేశించారు. జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద 108 యూనిట్ల స్థాపన లక్ష్యంగా కాగా 119 మంజూరు చేశామని, ఇందులో 70 గ్రౌండ్ అయ్యాయన్నారు. గుట్టపాటు క్లస్టర్‌లోని 900 ఎకరాల్లో రెడ్ క్యాటగిరి పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులను తీసుకురావాలని ఇండస్ట్రియల్ అసోసియేషన్ లోకల్ అథారిటీ ప్రెసిడెంట్ జి.రామకృష్ణారెడ్డి కోరగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

వలసల నివారణకు చర్యలు

జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. ఇందుకోసం శాఖల వారీగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగు పరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అడిగిన వారందరీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి సబ్సిడీ శాతాన్ని పెంచాలన్నారు.





శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో పంచరథాల యాత్ర, సూర్యభగవానుడి చిత్రపటానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



కర్నూలులో పూజలు అందుకున్న సూర్యనారాయణ స్వామి

నమో.. సూర్యదేవా!

● జిల్లాలో వైభవంగా రథసప్తమి వేడుకలు

కర్నూలు కల్చరల్/మంత్రాలయం: జిల్లాలోని సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో శనివారం రథ సప్తమి వేడకలు వైభవంగా జరిగాయి. అభిషేకాలు, అరుణ హోమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. నగర శివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం నాలుగో వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. మూల విరాట్టుకు దత్త విజయానంద తీర్థ స్వామి అభిషేకం నిర్వహించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. జిల్లా జడ్జీలు షర్మిల, జోత్స్న దేవి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో మూల విరాట్టుకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. సూర్యభగవానుడు, రాఘవేంద్రుల ప్రతిమలను పంచరథాలపై ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రథసప్తమి విశిష్టతను భక్తులకు ప్రవచించారు. మఠం మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదు గ్రామాల్లో 13వ నోటిఫికేషన్

కర్నూలు(అర్బన్): రీ సర్వేకు సంబంధించి ఆలూరు మండలం కాత్రికి, ఏ గోనేహాల్ మినహాయించి మరో ఐదు గ్రామాల్లో 13వ నోటిఫికేషను జారీ చేయనున్నట్లు డీపీఓ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దకడుబూరు మండలం పీకల బెట్ట, ఎమ్మిగనూరు మండలం దేవిబెట్ట, గార్ల దిన్నె, గోనెగండ్ల మండలం ఎస్ లింగందిన్నె, కౌతాళం మండలం వీర్లదిన్నె గ్రామాల్లో నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయినందున రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆస్తి హక్కు ధ్రువీకరణ పత్రాలను అందిస్తామన్నారు.

ఎస్టీ సర్పంచు, వార్డు సభ్యుల వివరాలు కోరిన సీపీఆర్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సర్పంచు, వార్డు సభ్యుల వివరాలను పంపాలని పంచాయతీరాజ్ కమిషనరేట్ కోరినట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మొత్తం 973 గ్రామ పంచాయతీలకు గాను 11 మంది సర్పంచు, 12 మంది ఉప సర్పంచులు, 99 మంది వార్డు సభ్యులు ఉన్నారన్నారు. సీపీఆర్ కోరిన విధంగా ఈ వివరాలను పంపినట్లు తెలిపారు.

'ఖేలో' పోటీలు వాయిదా

కర్నూలు (టౌన్): నగరంలో ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించనున్న రెండో ఖేలో ఇండియా సౌత్‌జోన్ పోటీలను వాయిదా వేసినట్లు రాష్ట్ర జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనం రామకిషోర్ రెడ్డి, శ్రీధర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత జూడో ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పోటీలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

డ్రెయినేజీలో శిశువు మృతదేహం

కోసిగి: ఆడపిల్లగా పుట్టిందనో, అక్రమ సంతానమనో.. మృత శిశువును ఇంటికి తీసుకెళ్లలేకనో.. డ్రయినేజీలో వదిలేశారు. శనివారం ఉదయం మండల కేంద్రమైన కోసిగిలో పసికందు మృతదేహాన్ని చూసి స్థానికులు చలించారు. పోలీసులకు సమాచారం అందించారు. బీరప్పస్వామి దేవాలయం సమీపంలో డ్రెయినేజీలోని పసికందు మృతదేహాన్ని ఎస్‌ఐ రాజారెడ్డి పరిశీలించారు. గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శిశువు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

కుక్కలకు విషం.. కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో కుక్కలకు విషం పెట్టి చంపారనే ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పెండేకంటి పెద్ద సుబ్బరాయుడు విషం పెట్టడంతో గ్రామంలోని కొన్ని కుక్కలు మృతి చెందాయని, దీంతో పాటు తన కుక్క అస్వస్థతకు గురైందని గ్రామానికి చెందిన పెద్ద ఎనుముల నాగార్జున ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



తగ్గుతున్న ఆడపిల్లల సంఖ్య

ఆడపిల్ల కాళ్లకు గజ్జలు కట్టుకుని తిరుగుతూ ఉంటే ఆ దృశ్యాన్ని చూసే తండ్రి కంట్లో ఆనందమే వేరు. నా బంగారు తల్లి ఎంత ముద్దుగా ఉందో అని సంబరపడిపోతుంటాడు. పెళ్లి చేసుకుని తనను వదిలి వెళ్లిపోతుంటే ఆ తండ్రి పడే వేదన అంతా ఇంతా కాదు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి పనిలో, ప్రతిచోటా మనకు స్త్రీలేనిదే సృష్టిలేదన్నట్లుగా ఉంటుంది. అలాంటి స్త్రీమూర్తి జననం పట్ల ఇంకా వివక్ష కొనసాగుతోంది. మగపిల్లలతో సమానంగా స్త్రీల జననం జరగడం లేదు. ఆడపిల్ల అని తెలియగానే గర్భంలోనే తుంచేస్తున్న పరిస్థితి ఇంకా కొనసాగుతోంది. ఫలితంగా జిల్లాలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది.

గతేడాది కర్నూలుపెద్దాసుపత్రిలో జరిగిన ప్రసవాలు			
నెల	మగపిల్లలు	ఆడపిల్లలు	మొత్తం ప్రసవాలు
జనవరి	368	319	687
ఫిబ్రవరి	350	263	613
మార్చి	339	313	652
ఏప్రిల్	376	374	750
మే	325	289	614
జూన్	361	330	691
జులై	363	321	684
ఆగస్టు	376	341	717
సెప్టెంబర్	391	373	764
అక్టోబర్	424	369	793
నవంబర్	446	405	851
డిసెంబర్	441	421	861
మొత్తం	4,560	4,118	8,677

- ప్రసవాల్లో బాలుర జననాలే అధికం
- ఆడపిల్లల పట్ల వివక్షతే కారణం
- గ్రామాల్లో మగపిల్లల పట్ల మక్కువ
- స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు
- ఆడపిల్ల అని తెలిస్తే కడుపులోనే చిదిమేస్తున్న వైనం!

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో గతేడాది అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 39,999 మంది ప్రసవించారు. ఇందులో 17,009 మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించారు. వీటిలో కర్నూలు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అధిక ప్రసవాలు ఉంటున్నాయి. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే గత సంవత్సరం మొత్తం 8,677 మంది ప్రసవించారు. రోజుకు 25 నుంచి 30 మంది వరకు ప్రసూతి విభాగంలో ప్రసవానికి వస్తున్నారు. మొత్తం డెలివరీల్లో 4,560 మంది మగపిల్లలు జన్మించగా, 4,118 మంది ఆడపిల్లలు పుట్టారు. దీనిని బట్టి జన్మించే వారిలో ఆడపిల్లల సంఖ్య ఎంతగా ఉందో అర్థం అవుతుంది. కొన్ని దశాబ్దాలుగా ఆడపిల్లల పట్ల వివక్ష ఇప్పటికీ కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో వరుసగా ఇద్దరు ఆడపిల్లలు జన్మిస్తే మూడో బిడ్డ కచ్చితంగా మగపిల్లవాడై ఉండాలని కోరుకుంటున్నారు. లేకపోతే మూడు, నాలుగో నెలలోనే లింగనిర్ధారణ పరీక్ష చేయించి కడుపులో ఉన్నది ఆడపిల్ల అయితే నిర్దాక్షిణ్యంగా భ్రూణహత్య(అబార్షన్) చేస్తున్నారు.

ఆగని లింగనిర్ధారణ పరీక్షలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 220 దాకా స్కానింగ్ సెంటర్లకు అనుమతి ఉంది. కొన్నిచోట్ల అనుమతి లేకుండానే స్కానింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ఇష్టారీతిన లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనితో పాటు కర్నూలులోని ఎన్‌ఆర్ పేట, కొత్తబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కొందరు వైద్యులు, ఆర్‌ఎంపీలు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం ట్రైనీ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో స్కానింగ్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. మళ్లీ అలాంటి దాడులు ఇప్పటి వరకు జరగలేదు. ప్రతిసారీ సమీక్ష సమావేశంలో స్కానింగ్ సెంటర్ల వారికి లింగనిర్ధారణ చేయకూడదని చెప్పి వదిలేస్తున్నారు. ఇంతే కదా అని పలువురు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.

కడుపులోనే చిదిమేస్తున్నారు

కొన్ని స్కానింగ్ కేంద్రాల్లో ఆడో మగో తేల్చేస్తుంటే మరికొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో భ్రూణహత్యలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆడపిల్ల అని తెలియగానే కొందరు, పెళ్లికి ముందు గర్భవతి అయ్యిందని మరికొందరు, కడుపులో బిడ్డ సరిగ్గా ఎదగలేదని ఇంకొందరు భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో చివరి కారణానికి వైద్యపరంగా అనుమతులు ఉన్నాయి. అయితే ఆడబిడ్డ అని తెలిసి భ్రూణహత్యకు పాల్పడటం ఒక విధంగా హత్య కిందకే వస్తుందని వైద్యులు చెబుతున్నారు. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో రెండు ప్రైవేటు ఆసుపత్రులు, ఎన్‌ఆర్ పేట, కొత్తబస్టాండ్‌లలో ఓ ప్రైవేటు ఆసుపత్రితో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలలోని ఆసుపత్రుల్లో భ్రూణహత్యలకు పాల్పడుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు. ఈ కారణంగానే జిల్లాలో ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్‌లకు సంబంధించి ఎవరికైనా కచ్చితమైన సమాచారం ఉంటే మాకు చెబితే విచారణ చేసి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. 1994 పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చేయడం నేరం. ఇలాంటి తప్పులు చేసిన వారికి జైలు శిక్ష ఖాయం. స్కానింగ్, అబార్షన్ చేసిన సదరు వైద్యుల పేరును భారత వైద్యవిధాన మండలి నుంచి తాత్కాలికంగా, కొన్నిసార్లు శాశ్వతంగా తొలగిస్తారు.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

అబార్షన్‌తో తల్లి ఆరోగ్యానికి ప్రమాదం



అబార్షన్ చేయిస్తే తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తరచూ గర్భం దాల్చడం వల్ల బీపీ, రక్తహీనత, షుగర్ వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత జన్మించే పిల్లలు సైతం నెలలు నిండకముందే జన్మిస్తారు. ఇది శిశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పుట్టబోయే బిడ్డ సరిగ్గా ఎదగనప్పుడు, తల్లికి నియంత్రించలేని బీపీ ఉన్నప్పుడు, 3, 4వ స్టేజిలో తల్లికి క్యాన్సర్ ఉన్నా తప్పనిసరి పరిస్థితిలో అబార్షన్ చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితులు మినహా ఆడపిల్ల వద్దనుకుని అబార్షన్ చేయించుకోవడం నేరం.

–డాక్టర్ కంచర్ల కావ్య, గైనకాలజిస్టు, కర్నూలు

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ భాస్కర్

పత్తికొండ రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టరీత్యా నేరమని అడిషనల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్, డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గర్భస్థ పిండ నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమన్నారు. సమావేశంలో సీఐలు రామకృష్ణారెడ్డి, మురళీమోహన్, తహసీల్దార్ విష్ణుప్రసాద్, వైద్యురాలు హారిక, కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రామ్మోహన్, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన క్రైస్తవులు

- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఉమ్మడి కర్నూలు జిల్లా పట్టభద్రుల ఎన్నికల పరిశీలకులు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో శనివారం పసుపుల గ్రామ శివారులోని జార్జ్ భవన్‌లో క్రైస్తవ నాయకులు, పాస్టర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీవై రామయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనాలు అందిస్తోందన్నారు. క్రైస్తవ పిల్లల వివాహాలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తోందన్నారు. క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. పశ్చిమ రాయలసీమ వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పాస్టర్లు, క్రైస్తవ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, పట్టభద్రుల ఎన్నికల వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యవేక్షకులు కుమార్‌రెడ్డి, పాస్టర్స్ సంఘాల నాయకులు అస్కానండ్, వరప్రసాద్, ప్రభుదాస్, బంగారు రాజశేఖర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 'సిరి' సాగుపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): సిరి ధాన్యాల సాగుపై ఈ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు సాగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ వారీగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సిరి ధాన్యాల్లో ఉన్న పోషకాలు, సాగుకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు, మార్కెటింగ్, మినీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం



మద్దిలేటి (ఫైల్)

ప్యాపిలి: ఏనుగుమర్రి గ్రామం వద్ద స్థానిక 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం బొలెరో వాహనం ఢీ కొట్టడంతో పోలీసు మద్దిలేటి (53) మృతి చెందాడు. ఏనుగుమర్రి గ్రామానికి చెందిన పోలీస్ మద్దిలేటి తన కుమారుడు మనోహర్‌తో కలసి జాతీయ రహదారి మీదుగా బహిర్భూమికి బయలుదేరాడు. డోన్ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంతో వచ్చి మద్దిలేటిని ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో మద్దిలేటి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రమీల, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

పొలం వివాదంలో తల్లి, కొడుకుపై దాడి





దాడిలో గాయపడిన సంజమ్మ, అనిల్ కుమార్

ఆస్పరి: మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామంలో తల్లి, కొడుపై దాడి జరిగిందని ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన సంజమ్మ, వెంకటేష్‌కు మధ్య పొలం వివాదం ఉందన్నారు. చాలా ఏళ్లుగా వీరి మధ్య మనస్పర్థలున్నాయన్నారు. శనివారం సంజమ్మ, అతని కుమారుడు అనిల్ కుమార్ పొలంలో పని చేస్తుండగా దాడి జరిగిందన్నారు. గాయపడిన తల్లి, కుమారుడిని చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్, నెట్టెప్పతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)		
పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశెనగ	5600	8820
పొద్దుతిరుగుడు	3001	5131
ఆముదం	6089	6410
ఉల్లి	751	1218
ఎండు మిర్చి	6199	29099
శనగలు	3990	4690
కందులు	2100	7109
మొక్కజొన్న	1617	1617
మినుములు	6605	6789

